ప్రజాశక్తి

ఆదివారం 5 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రజారక్షణ భేరికి అపూర్వ స్పందన

- విశాఖలో ఎక్కడికక్కడ జననీరాజనం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య పాలనను ఎండగట్టిన సిపిఎం నేతలు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం : పి.మధు, సిహెచ్.నర్సింగరావు, లోకనాథం, ఎంవిఎస్.శర్మ

యాత్రా బృందానికి పూర్ణామార్కెట్ వద్ద ఘన స్వాగతం పలుకుతున్న మహిళ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, సింహాచలం, కరాస, మాధవధార, కలెక్టరేట్, ములగాడ, గాజువాక విలేకరులు

విశాఖ జిల్లాలో సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సు యాత్రకు శనివారం అపూర్వ స్పందన లభించింది. ఎక్కడికక్కడ జన నీరాజనం దక్కింది. ప్రజలు ఎదురేగి పూలు జల్లి, తిలకం దిద్ది.. హారతులిస్తూ ఈ యాత్రకు స్వాగతం పలికారు. 'అసమానతలు లేని అభివృద్ధి కోసం' తలపెట్టిన ఆ యాత్ర విశాఖ నగర వాసులను తట్టిలేపింది. ప్రజల కష్టాలను తెలుసుకుంటూ.. వారికి భరోసా కల్పిస్తూ సాగింది. యాత్ర జరిగిన చోట కళారూపాలు ఆకట్టుకున్నాయి. ప్రజలను చైతన్యపరిచాయి. సిపిఎం నేతల ప్రసంగాలను అన్నిచోట్లా ప్రజలు ఆసక్తిగా విన్నారు.

ఎన్ఎడి జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర కంచరపాలెం, ఆర్‌టిసి కాంప్లెక్స్, జగదాంబ, పూర్ణామార్కెట్, శ్రీహరిపురం, గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో సాగింది. ఆయా చోట్ల జరిగిన సభల్లో సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ పి.మధు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి లాలూచీని వివరించారు. మూడోసారి మోడీ గెలిస్తే దేశానికి రక్షణ ఉండదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి నాటకాలను సాగనిచ్చేది లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని అన్నారు. స్థానిక పూర్ణా మార్కెట్ ప్రజలను అడిగితే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తీరు దారుణంగా ఉందని చెబుతున్నారని తెలిపారు. వారిద్దరూ కలిసి ఆశీళ్లను అడ్డగోలుగా వసూలు చేస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడు తున్నారని చెప్పారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. పార్టీ మిగతా 2లో..

ఆకట్టుకున్న కళారూపం

గాజువాక జంక్షన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న నర్సింగరావు

మీడియాతో మాట్లాడుతున్న కుష్విన్దర్ వోప్రా

ముగిసిన ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరుగుతున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసిఐడి) కాంగ్రెస్ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారత నీటి పారుదల జాతీయ కమిటీ ఛైర్మన్ కుష్విన్దర్ వోప్రా మాట్లాడుతూ ఈ సమావేశాలు 57 సంవత్సరాల తర్వాత దేశంలో జరిగాయని, 40 దేశాల నుంచి 350 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. జలవనరుల నిర్వహణ, నీటిపారుదల సవాళ్లను ఎదుర్కొనే అంశాలపై చర్చించినట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో మొత్తం 18 సెషన్లు, 6 అంతర్జాతీయ వర్క్‌షాప్‌లు, 12 సైడ్ ఈవెంట్లు, 2 అంతర్జాతీయ సింపోజియంలు, 2 ప్లీనరీ సెషన్లు నిర్వహించామన్నారు. వ్యవసాయ రంగంలో నీటి కొరతను పరిష్కరించడానికి, ప్రపంచ ఆహార భద్రతను సాధించడానికి నిపుణుల మధ్య పలు చర్చలు జరిగాయని తెలిపారు. ఇప్పటికే ఉన్న నీటిపారుదల మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా మిగతా 2లో..

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి ▸ వార్త 2లో..

రామవరం రోడ్డు నిర్మాణానికి 'గండి' ▸ వార్త 3లో..

దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలు కీలకం ▸ వార్త 3లో..

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి ▸ వార్త 7లో..

మహిళామార్టులో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వార్త 4వ పేజీలో....

ప్రయివేట్ దారిలో మన రైలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నేతి బీరకాయలో నేయి ఎంతో మన రైలు బండిలో భద్రత ప్రమాణాలు అలాగే అఘోరిస్తున్నాయన్న చర్చ ఇప్పుడు ఆ నోటా ఈ నోటా వినిపిస్తున్న మాట. అయితే కేంద్ర పాలకులు మాత్రం 'బదిరుల' పాత్ర పోషిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. రైల్వేల్లో అత్యంత తరచుగా జరగాల్సిన ట్రాక్ రిపేర్ల గురించి రైల్వే శాఖకు పట్టడం లేదు. ఒకవేళ ఎక్కడైనా చేసినా తూతూ మంత్రంగా చేస్తూ, ట్రాక్ రిపేర్లకు పట్టే సమయాన్ని కుదించేసే విధానం కేంద్రం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. పైలట్లకు తగిన శిక్షణ కూడా ఇవ్వడం లేదని కొంతమంది లోకోపైలట్లు లబోదిబోమంటున్నారు. సిగ్నలింగ్ సిస్టంపైనా ఆరోపణలు ఉన్నాయి. దీంతో ట్రాక్‌ల పరిస్థితి తెలిసే లోకో పైలట్లలో సహజంగానే ఒత్తిడి ఉంటుందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. తగిన సిబ్బంది వాల్తేరు రైల్వేలో లేనందున ఉన్న వారిపై ఒత్తిడి నానాటికీ పెరుగుతోంది. 2వేల ఖాళీలు వాల్తేరు రైల్వేలో ఏళ్లతరబడి ఉన్నాయి. వాటిని భర్తీ చేయడంలేదు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో రైల్వే ఆస్తులను ప్రయివేట్ కంపెనీలకు దారాదత్తం చేయడం, రైల్వేల్లో ఆపరేషన్స్‌ను సైతం కాంట్రాకీకరణ చేసే దిశగా చర్యలతో

'మన రైలు' ప్రమాదంలో పడింది.

కార్పొరేట్ల ప్రయోజనాలే...

ప్రపంచంలోనే అత్యంత చౌకగా సామాన్య ప్రజానీకాన్ని దూర ప్రాంతాలకు తీసుకెళ్లే రవాణా సాధనమైన 'రైలు బండి'ని ప్రయివేట్, కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుగుణమైన 'పట్టా' (ట్రాక్)లపైకి మోడీ సర్కారు తెచ్చే ప్రణాళికలను అమలు చేస్తోంది. రైల్వేల బాధ్యతల నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకోడానికి గడిచిన ఐదారేళ్లుగా చేస్తోన్న ప్రయత్నాల ఫలితంగా ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందని చెప్పే రైల్వే నిపుణుల ఆలోచనలను సైతం లెక్కచేయడం లేదు. దేశమంతటా రైలు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా మన వాల్తేరు రైల్వే డివిజన్‌లో ఘోరరైలు ప్రమాదాలు గడచిన 5ఏళ్లలో చోటుచేసుకున్నాయి. గతంలో మనుషుల్లేని రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు జరగ్గా నేడు రైలు పట్టాలే తప్పడం, ఎదురెదురుగా గుద్దుకోవడం ఘటనలతో ప్రజల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో విచారణ పేరుతో ఉద్యోగులపై నెపం నెట్టేసి ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకోవడం షరామామూలైపోయింది.

ప్రమాదాలపై విచారణ...

తాజాగా అలమండ-కంటకాపల్లి రైలు ప్రమాదంపై మూడు రోజులుగా కమిషనర్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రజారక్షణ భేరికి అపూర్వ స్పందన

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ నేడు భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు బతుకులు దుర్భరంగా తయార య్యాయన్నారు. రోజూ ఉపాధి దొరకడం గగనమై పోయిందన్నారు. రాష్ట్రానికి కేంద్రం తీవ్ర ద్రోహం చేస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక బిల్లులకు పార్లమెంట్‌లో వైసిపి, టిడిపిలు ఎలా మద్దతు తెలిపాయో వివరించారు. 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. కంచరపాలెం మెట్టు వద్ద జరిగిన సభలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. బిజెపి పాలనలో దేశం దుర్భరంగా తయారవుతోందని తెలిపారు. నిరుద్యోగులు, పేదలు పెరుగుతున్నారన్నారు. ప్రజలపై అన్ని రకాల భారాలూ పడుతున్నాయని చెప్పారు. పాత గాజువాక, కూర్మన్నపాలెం జంక్షన్లలో జరిగిన సభల్లో సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలతోనే గాజువాక ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఈ ప్రాంతానికి పాలకులు చేసిన అన్యాయాన్ని వివరించారు. సిపిఎం పోరాట ఫలితంగా సుందరయ్య కాలనీ, దశమకొండ, స్వతంత్ర నగర్ ఏరియాల్లో ఇళ్ల స్థలాలు వచ్చాయన్నారు. రాష్ట్రం అదానీ ఆంధ్రప్రదేశ్‌గా మారిపోతోందని తెలిపారు. త్యాగాలతో ఏర్పడ్డ విశాఖ స్టీల్‌ప్లాంట్ గొప్పతనాన్ని వివరించారు. నేడు ఈ కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తెలియజేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, హరిబాబు, బి.ప్రభావతి మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్ వంటి సౌకర్యాలు లేవన్నారు. సిపిఎం అధికారంలో ఉన్న కేరళలో పెన్షన్, పిఎఫ్ అమలవుతున్నాయని తెలిపారు. కేంద్రం విధానాలతో దేశమంతటా నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయాచోట్ల జరిగిన సభల్లో విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, కెఎం.శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరావు, బి.రమణి, పి.మణి, రాజు, సుబ్బారావు, నాయకులు నరేంద్ర, వై.రాజు, డి.అప్పలరాజు, చంద్రమౌళి, పి.వెంకటరావు, టి.నూకరాజు, టివి.కృష్ణంరాజు, ముద్దాడ వరప్రసాద్, పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, సత్యారావు, మమత, విమల, రాంబాబు, అయోధ్యరామ్, ఎన్.రామారావు, శ్రీనివాసరాజు, రామస్వామి, నమ్మి రమణ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.సత్యనారాయణ, నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

జోరు వానలోనూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు

ఎన్ఎడి జంక్షన్ వద్ద గల ప్రైవేట్ కాలేజీలకు చెందిన వందల మంది విద్యార్థులు సిపిఎం చేపట్టిన బస్సు యాత్రకు జోరువానలో ఘన స్వాగతం పలికారు. వారితో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ఇంటరాక్షన్ అయ్యారు. సిపిఎం దేశభక్తిగల పార్టీ అని, విద్యార్థులంతా దేశభక్తులని ఆయన అనగానే చప్పట్ల వర్షం కురిసింది. మోడీ దుర్మార్గ పాలనను ఆయన వివరించారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదం మార్మోగింది. శ్రీహరిపురం గణేష్ మందిర్ దగ్గర నుంచి కోరమండల్ గేట్ వరకు డప్పుల వాయిద్యాలు హోరెత్తాయి. అక్కడ యాత్రకు ఘన స్వాగతం లభించింది. జనం పూల వర్షం కురిపించారు. కోలాటం, తీన్మార్ డ్యాన్సులు ఆకట్టుకున్నాయి.

ముగిసిన ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు

నిర్వహించడం, వాతావరణాన్ని తట్టుకునే నీటిపారుదల మౌలిక సదుపాయాలు, నీటిపారుదల రంగంలో ఉపరితల, భూగర్భ జలవనరుల వినియోగం, మెరుగైన నీటి నిర్వహణ, నీటిపారుదల రంగానికి తగిన నిధులు, అంతర్జాతీయ సహకారం తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. సమావేశాల్లో యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ), ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యుఎంఐ), ఇండియా ఇయు వాటర్ పార్టనర్‌షిప్ (ఐఇడబ్ల్యుపి), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జిఐజెడ్), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ డ్రై ఏరియా, స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, చైనీస్ నేషనల్ కమిటీ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ, నీటిపారుదల జాతీయ కమిటీలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశాయన్నారు.

ప్రయివేటు దారిలో 'మన రైలు'

రైల్వే స్టేఫ్టీ (సిఆర్ఎస్) వాల్తేరు రైల్వేలో విచారణ నిర్వహిస్తోంది. రికార్డులు, డాక్యుమెంట్లు పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. సిబ్బంది డ్యూటీలు, వారికి ఇస్తోన్న శిక్షణా కార్యకలాపాలు, సిగ్నల్ సిస్టం మోనటరింగ్ ఎలా ఉంది అనే విషయాలపై ప్రాథమికంగా 3 రోజుల నుంచి విచారణ సాగుతోంది. ఈ నెల 6న సోమవారం రైల్వే అధికారులను కూడా సిఆర్ఎస్ విచారణ చేయనుంది. వాస్తవానికి 2 రోజులే విచారణ అని తొలుత ప్రకటించి తర్వాత ఒకరోజు, తాజాగా 3 రోజులు వ్యవధి సిఆర్ఎస్‌కు అవసరమైందంటే పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో అర్థమవుతోంది. భద్రతకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో అంత ఇచ్చారా? అంటే ఈ ప్రమాదాలు చూస్తే ససేమిరా అనిపించక మానదు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

ఐఐఎ ఎపి ఛాప్టర్ చైర్మన్ విజయభాస్కర్

సమావేశంలో పాల్గొన్న ఐఐఎ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ఐఐఎ) ఎపి ఛాప్టర్ చైర్మన్ విజయభాస్కర్ ఇమంది సూచించారు. ఐఐఎ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులోని గేట్ వే హోటల్‌లో శనివారం విద్యార్థులకు ఆర్కిటెక్చర్‌పై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఐఎ అధ్యక్షులు విలాస్ వసంత్ అవాచాత్, టిటిసిపి డైరెక్టర్ ఆర్ఎల్ విద్యుల్లత, ఐఐఎ కాకినాడ చైర్మన్ వివిఎల్‌వి.మూర్తి హాజరై ఆర్కిటెక్చర్ అవసరాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యంగా ఈ సమావేశం అభివృద్ధి చెందిన రాష్ట్రాల నుంచి డెలిగేట్స్ పాల్గొని నగర అభివృద్ధి అధునాతన భవనాలకు అవసరమైన ఆధునీకరణ నిర్మాణాలపై అవగాహన కల్పిస్తారన్నారు. పారా మెట్రిక్ డిజైన్, గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్, హాయ్ రైసు స్ట్రక్చర్స్ అంశాలపై ప్రసంగిస్తారని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విజేతలకు సర్టిఫికెట్‌తో పాటు ప్రోత్సాహకాలు అందజేశారు.

'జగన్ ప్రభుత్వం టిడిపిని అడ్డుకుంటోంది'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో జగన్ ప్రభుత్వం చివరి ఆరు నెలల్లో టిడిపిని అడ్డుకోవాలని చూస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేమనే జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందన్నారు. ఏది అక్రమమో ఏది సక్రమమో ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్‌పై సిబిఐలో 2012 నుంచి 2014 వరకు 11 చార్జిషీట్‌లు ఉన్నాయని, రూ.43 వేల కోట్లు దోచేశారని కాగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చార్జిషీట్లు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతికేసులోనూ జగన్‌పై కామన్‌గా సెక్షన్ 420 నమోదైందని తెలిపారు. ఇటువంటి వ్యక్తి చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నాడని ఎద్దేవాచేశారు. అక్రమాస్తులపై జగన్‌పై సమోదైన సిబిఐ కేసుల్లో 3041 వాయిదాలకు ఆయన వెళ్లలేదన్నారు. జగన్ బెయిల్‌పై వచ్చి పదేళ్లు పూర్తయిందని, అక్రమాస్తుల కేసుల్లో జగన్‌తోపాటు ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా భాగస్వాములయ్యారని, ఎవరు వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. రెవెన్యూ పత్రాలు మార్చేసిన ధర్మాన ప్రసాదరావు రెవెన్యూ మంత్రి ఎలా అయ్యారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీల అధ్యక్షులు రహమతుల్లా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, చిన్న రెహమాన్, బొట్టా పరదేశి యాదవ్, కోనేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్‌లో విజిలెన్స్ వారోత్సవం

ర్యాలీ చేస్తున్న కెనరా బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కెనరా బ్యాంక్ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం -2 పరిధిలోని ప్రాంతీయ కార్యాలయంలో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవములను నిర్వహించారు. ఈ సందర్భంగా డాబాగార్డెన్స్ మెయిన్ రోడ్డులో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ ఎజిఎమ్ ఎల్ఆర్.విజయశ్రీ మాట్లాడుతూ, "అవినీతిని వ్యతిరేకిద్దాం, జాతికి కట్టుబడి ఉందాం" అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కార్మికులు ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు పిలుపునిచ్చారు. ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం కెజిహెచ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ, అనేక కార్మిక చట్టాల సాధనలో ఎఐటియుసి పాత్ర ఉందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కెజిహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, కెజిహెచ్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల శ్రమ ఉందన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కెజిహెచ్ యాజమాన్యం సిద్ధంగా ఉంటుందన్నారు. ఎపి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జెడి.నాయుడు మాట్లాడుతూ, కార్మికులకు రూ.32 వేలు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సిఎస్ఆర్ఎంఒ అరుణాదేవి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, కెజిహెచ్ కాంట్రాక్ట్ యూనియన్ ప్రెసిడెంట్ జె.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అప్పలరాజు, డి.మంగ, వినోద్, గణేష్, కుమారి, రాజు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంచర్ల యశ్వంత్ జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు కుమారుడు కీర్తిశేషులు యశ్వంత్ 26వ జయంతిని ఎంవిపి కాలనీలోని నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల కుటుంబ సభ్యుల మధ్య అచ్యుతరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జయంతిని పురస్కరించుకొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, యశ్వంత్ చిన్నతనంలోనే మృతిచెందారని, ఏటా ఆయన జన్మదినం రోజున అందరికీ తను వంతు సాయాన్ని అందజేస్తూ, జయంతి వేడుకలు జరుపుకుంటామని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఎదుటవారికి ఉపయోగపడే విధంగా సహాయ, సహకారాలను అందించడం ద్వారా ప్రజలకు ఎంతో కొత్త మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు సుధీర్, స్థానిక ప్రజలు, కంచర్ల అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 23వ వార్డు పరిధిలో సుమారు రూ.33.45 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మద్దిలపాలెం వద్ద రూ.19.90 లక్షలతో సిసి కాలువలు, రోడ్లు నిర్మాణానికి, చైతన్య నగర్ వద్ద రూ.6.63 లక్షలతో ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్, భావన స్కూల్ వద్ద రూ.6.92 లక్షలతో గెడ్డకు రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వాసుపల్లి వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజాదర్బార్‌లో వచ్చిన మెడికల్ సమస్యలు పరిష్కరించడంలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో వివిధ రోగ పీడితులైన ఎనిమిది మందికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం ఆర్థిక సహాయం అందించారు. రోగుల ఇళ్లకు వెళ్లి పరామర్శించి రూ.45 వేలు సొంత నిధులు అందజేశారు. ఆర్థిక సాయం పొందిన వారిలో 27 వార్డు శ్రీనగర్‌కు చెందిన దేవరపల్లి నిఖిల్ సాయి (రూ.10 వేలు) ఉన్నారు. ఆర్థిక సాయంతో పాటు బాధితునికి ఉచితంగా హుదూద్ ఇళ్లు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 30వ వార్డు పరిధి జాలారిపేట ఏరియాలో నివసించే వాసుపల్లి సత్యవతి, నక్క సత్యం, 39వ వార్డు పరిధి కోట వీధిలో నివసించే మొహమ్మద్ ఇస్మాయిల్, ఫెర్రి రోడ్‌లో నివసించే వాడమోదుల అప్పలనరసమ్మ, 35వ వార్డు పరిధి వెలంపేట ఏరియాలో నివసించే దాసరి మణి, గాజులవీధిలో నివసించే సుబ్బరాజు పితాని, 34వ వార్డు పరిధి భూపేష్ నగర్ ఏరియాలో నివసించే తుంపాలా గణేష్‌కు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసిపి వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
M.O.P. 708/19

Between :
Pathiwada Krishnaveni **...Petitioner.**
And :
V.Surappanna and 2 others
...Respondents.

NOTICE

To R-1& R-2
1. Venkata Surappanna,
S/o Narayana, Hindu, Aged 27 years, R/o Savaravilli village, Bhogapuram mandal, Vizianagaram district-535216. (The driver of the lorry bearing No AP 31 TU 5186).
2.Debendranath Sahu,
S/o Neelakanta Sahu, R/o D.No 16-61, China Gantyada, Gajuwaka, Visakhapatnam.(The owner of the lorry bearing No AP 31 TU 5186).

Please take notice that the above named petitioner have instituted the above petition against you for compensation with interest and costs. You are hereby summoned to appear before the court in person or through advocate duly instructed and able to answer all material questions relating to the above petition on **16-11-2023 at 10-30 A.M,** in default of your appearance on that day, the matter will be heard and decided in your absence.

(By order of honourable court of the II Additional District Judge At Visakhapatnam)

Betina Srinivas,
D.S.R.Rajeswari,
Gorli Rajesh,
Advocates, Anakapalli.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు బంటా కాలనీలో రూ.19.85 లక్షలతో 30కెఎల్ సామర్థ్యం గల జిఎల్ఎస్ఆర్ ప్రాంతంలో ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, స్థానిక నాయకులు జగదీష్, శంకర్, కంపర సత్తిబాబు పాల్గొన్నారు.

మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి

52వ వార్డులో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి - కరాస: జివిఎంసి 52వ వార్డును మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. శనివారం అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. అంబేద్కర్ నగర్ ఎన్‌హెచ్ 16 బస్‌షెల్టర్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కరాస హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశానవాటికలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కులు, గ్రీన్ బెల్ట్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ, వార్డులోని మిగిలిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. డిడి హెచ్.దామోదర్, హార్టీకల్చర్ ఎఇ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెదుళ్ల శ్రీను పాల్గొన్నారు.

వంటశాలకు స్థలం వితరణ

దాతతో యాదవ సంఘం సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 61వ వార్డు ఆర్‌కె.పురం, వెంకన్నపాలెం గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయం వంటశాల నిర్మాణానికి శ్రీమురళీకృష్ణ యాదవ సంఘం భవనానికి ఆనుకుని ఉన్న 60 గజాల విలువైన స్థలాన్ని చెల్లుబోయిన సత్యవతి వితరణగా అందజేశారు. ఆ స్థలంలో వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు వైసిపి అధ్యక్షులు జివిఎస్ఎన్.రాజు (వాసు), సంఘ పెద్దలు కర్రి దుర్గారావు, ఉరుకూటి చిన్నారావు, నీలాపు అప్పలరాజు, సంఘ సభ్యులు ఉరుకూటి సూర్యప్రకాశ్, లాయర్ రాజు పాల్గొన్నారు

నర్సీపట్నం నియోజకవర్గ

వైసిపి ఎన్నికల పరిశీలకునిగా బొడ్డేటి

ప్రజాశక్తి -సీతమ్మధార : అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకుడిగా సీనియర్ నేత బొడ్డేటి విశ్వనాథను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బొడ్డేటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నర్సీపట్నంలో అందరి సమిష్టి కృషితో వైసిపి విజయానికి పాటుపడతానన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

రామవరం రోడ్డు నిర్మాణానికి 'గండి'

- వైసిపి నేతల అభ్యంతరంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- అభివృద్ధిని రాజకీయం చేయడంపై స్థానికుల మండిపాటు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని రామవరం గండిగుండం రోడ్డు నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో నిధులు మంజూరు కాగా, వారం రోజుల క్రితం స్థానిక సర్పంచ్ యర్ర పైడిరాజు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. శనివారం వెల్లంకి చెందిన కాంట్రాక్టర్ వాకచర్ల శ్రీనివాసరావు జెసిబితో పనులు ప్రారంభిస్తుంటే, తమ ప్రమేయం లేకుండా సర్పంచ్ ఎలా రోడ్డును ప్రారంభిస్తారని స్థానిక వైసిపి నేతలు కాంట్రాక్టర్‌కు ప్రశ్నించారు.. రోడ్డు పనులు చేయరాదని, నిధులు రద్దు చేస్తున్నట్లు కాంట్రాక్టరుకు చెప్పడంతో... తనకెందుకే గోల అనుకుని రోడ్డు పనులకు తెచ్చిన జెసిబి, రోడ్డు రోలర్, ఇతర యంత్రసామగ్రిని తీసుకుని వెళ్లిపోయాడు. దీనిపై కాంట్రాక్టర్‌ను అడగ్గా, రోడ్డుకు మంజూరైన నిధులు రద్దయ్యాయని అధికారులు చెప్పారని, కొత్తగా నిధులు మంజూరైన తర్వాత పనులు చేద్దువులే అని చెప్పారన్నారు.

పనులు ఆపేయడంతో వెనక్కు వెళ్లిపోతున్న రోడ్డు రోలర్

స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచిన సర్పంచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే నిధులు రద్దుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకోవడంపై ఇదేమి చోద్యమంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. రాజకీయాలు చేయడం మాని రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యసాధన

అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -తగరపువలస :పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను స్థానిక ఎమ్మెల్యే, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చక్కని ప్రణాళిక, సమయపాలన అవసరమని, మంచి ఆలోచనలు వ్యక్తిత్వంతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలని సూచించారు. డిసిపి (క్రైమ్) జి.నాగన్న మాట్లాడుతూ, ర్యాగింగ్, డ్రగ్స్ వంటివాటికి దూరంగా ఉండాలని సూచించారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ, తాజాసాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నా రు. సీనియర్ డైరెక్టర్, (ఆపరేషన్స్)దాసరి కిషోర్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో చదివి సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు.. ఉద్యోగరీత్యా ఎస్వాయిలో ఉన్నా సరే దేశ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల ఎండి ఐ.శ్రావణ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలు కీలకం

గీతం యూత్ కాన్‌క్లేవ్‌లో ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మధురవాడ : దేశ ప్రగతికి నూతన సాంకేతిక పరిజ్ఞానం కీలకమని,: పారిశ్రామిక రంగం నుంచి అంతరిక్షరంగం వరకు నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఎంతో ఉందనిఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చి బోర్డు (సెర్బ్), ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్ఎఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి యువ సమ్మేళనం 'యూత్ కాన్‌క్లేవ్ -2023' ముగింపు సభలో మాట్లాడుతూ సమాచార సాంకేతిక రంగం, కమ్యూనికేషన్ వ్యవస్థలు, శక్తి వనరుల రంగంలో వస్తున్న మార్పులను యువత అర్థం చేసుకోవాలన్నారు. హరిత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే సరికొత్త ఆవిష్కరణలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. రక్షణ, అంతరిక్ష రంగంలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడుతోందన్నారు.

ఐఎన్ఎఇ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల ద్వారా యువత స్టార్టప్‌లతో ఏవిధంగా ఎదగవచ్చో వివరించారు. బజాజ్ ఆటో సంస్థ నైపుణ్యాభివృద్ధి విభాగాధిపతి రమేష్ వేణుగోపాలస్వామి మాట్లాడుతూ దేశంలోని ఐటిఐల సహ వివిధ విద్యాలయాల నుంచి వస్తున్న యువతలో నైపుణ్యాల లోపం గుర్తించి తమ సంస్థ బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) పేరిట ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పిందన్నారు. 70 శాతం ప్రాక్టికల్ శిక్షణతో ప్రత్యేక కోర్సులను రూపొందించి వివిధ విద్యాలయాల ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న 200 పైగా సమస్యలను తాము గుర్తించామని వాటి పరిష్కారాన్ని కనుగొనే వారికి సహకరిస్తామన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ జనరల్

గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ఐఎన్ఎఇ కోర్డినేటర్ ప్రొఫెసర్ డిఆర్.ప్రసాద్‌రాజు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ తరహా యువ సమ్మేళనాలు మరిన్ని జరగాలన్నారు. గీతం రీసెర్చి డవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజాప్పప్పు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు బీచ్‌రోడ్డులో తొట్లకొండ ఎదురుగా గుర్తు తెలియని మృతదేహం శనివారం పోలీసులకు లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం మృతుని వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుంది. ఇతర వివరాలు తెలియరాలేదన్నారు. ఎస్ఐ భరత్‌కుమార్ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

6న సామాజిక సాధికార బస్సు యాత్రను

విజయవంతం చేయండి

ప్రజాశక్తి -గాజువాక : ఈ నెల 6న సోమవారం పాతగాజువాకలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టిఎన్ఆర్ కల్యాణమండపంలో నియోజకవర్గంలోని అన్ని వార్డుల ముఖ్య నాయకులు, వైసిపి కార్పొరేటర్లు, కన్వీనర్లు, గృహ సారథులు, డైరెక్టర్లు, వైసిపి శ్రేణులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బస్సు యాత్రకు జన సమీకరణపై సూచనలు ఇచ్చారు. సాధికార బస్సుయాత్ర సోమవారం మధ్యాహ్నం 2గంటలకు టిఎన్ఆర్ కల్యాణమండపం నుంచి బయలుదేరుతుందన్నారు. సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, రాజాన రామారావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, గంగులూరి రోజారాణి, ధర్మాలు శ్రీను, దొడ్డి రమణ, గుడివాడ లతీష్, బొడ్డు గోవింద్, గంగబాయి, రాజాన వెంకటరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

సాయం అందజేస్తున్న సందీప్

ప్రజాశక్తి- పద్మనాభం : మండలం తునివలస పంచాయితీ నరసాపురం అగ్నిప్రమాద బాధితులను భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, ఇతర నేతలు శనివారం పరామర్శించారు. బాధితులు హరీష్, బంగారయ్య కుటుంబాలకు నిత్యావసరాలు, పిల్లలకు, పెద్దలకు బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, అగ్నిప్రమాద బాధితుల పట్ల అధికారులు, వైసిపి నేతల నిర్లక్ష్యం సరికాదన్నారు. బాధితులకు గూడు, విద్యుత్ తక్షణ సౌకర్యాలతోపాటు సాధారణ స్థితి వచ్చేవరకు ఆదుకోవాలన్నారు. త్వరలో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, బాధితులకు అన్నివిధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు.కార్యక్రమంలో శ్రీనుబాబు, బివి కృష్ణయ్య, ఐనాడ శ్రీను, సారది, సూరప్పుడు, సంతోష్, జెఎస్ రావు, టిడిపి నాయకులు తట్టకొట్టి శ్రీనివాసరావు, చెరకాన అదినారాయణ, ఒవళ్ళ సన్యాసిరావు పాల్గొన్నారు,

ఇద్దరికి పింఛన్లు అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు, కొత్తపేటకు చెందిన ఇద్దరికి శనివారం వృద్ధాప్య పింఛన్లు పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు

200 రోజులుగా అనాథలకు ఆహార పొట్లాలు

ప్రజాశక్తి- తగరపువలస :టీచర్స్ హెల్ప్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ శనివారం నాటికి 200 రోజులుగా కొనసాగిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మరగడ రామకృష్ణ తెలిపారు. శనివారం పలువురు నిరుపేదలకు సంస్థ సభ్యులు ఆహార పొట్లాలు అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

మహిళా మార్టు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మహిళా మార్టు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి-ఆనందపురం: డ్వాక్రా మహిళలే యజమానులుగా మహిళామార్టులను ఏర్పాటుచేసి, వారి ఆర్థికస్వావలంభనకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్ఆర్ చేయూత మహిళా మార్టును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ప్రారంభించారు. సిఎం జగన్ మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తొన్నారన్నారు. మహిళా మార్టుకు రూ.15 లక్షలు అందించిన లవింగ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ సంస్థ ఏసుపాదంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, రాష్ట్రంలో 43మహిళా మార్టు ఆనందపురంలో ప్రారంభమైందన్నారు. అయితే సొంత భవనంలో ఏర్పాటైన తొలి మహిళామార్టు ఇదేనన్నారు. మండలంలో మరో మహిళామార్టు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. జెడ్పి చైర్పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ, సంక్షేమ పథకాల్లో మహిళలకు సిఎం జగన్ మొదటి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు .డిఆర్డిఎ పీడీ శోభారాణి మాట్లాడుతూ,మండలంలోని 150 మహిళా సంఘాలకు చెందిన 1500 మంది సభ్యులే యజమానులుగా ఈ మార్టు నిర్వహిస్తారన్నారు.

మహిళ చేయూత అదనపు డైరెక్టర్ మహిత మాట్లాడుతూ మహిళా మార్టులో ప్రతి వస్తువూ నాణ్యతతో బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు అందజేస్తామన్నారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి, ప్యాకింగ్ చేసి అమ్మకానికి పెడతామన్నారు. ఇక్కడే మెటీరియల్ ప్యాకింగ్ యూనిట్ను ఏర్పాటు చేసి, జిల్లాలోని ఇతర మార్టులకు సరుకులను ప్యాకింగ్ చేసి సరఫరాకు మిషనరీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ ఏసు పాదం, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మీసాల లక్ష్మి, మండల మహిళా మార్ట్ అధ్యక్షురాలు బుంగ రమ, తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడపా లవరాజు, జెడ్పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, ఎంపిటిసి రౌతు శ్యామల వెంకటరావు, సర్పంచులు లోడగల రాజేశ్వరి రమణ, చందక లక్ష్మి, గన్ రెడ్డి శ్రీనివాసరావు బిఆర్బి నాయుడు, బోని అప్పలనాయుడు, లంక రాంబాబు, లోడగల రమణ, కాకర వెంకటరమణ, బలిరెడ్డి మహేష్, రౌతు శ్రీను పాల్గొన్నారు

జూపార్కు సందర్శన

జూ సందర్శనలో డెహ్రాడూన్ ఫారెస్ట్ అకాడమీ ప్రొబెషనర్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను డెహ్రాడూన్ ఫారెస్ట్ అకాడమీ ప్రొబెషనర్లు శనివారం సందర్శించారు. శిక్షణలో భాగంగా జూపార్కు నిర్వహణ, జూలో కన్జర్వేషన్ బ్రీడింగ్, వివిధ జంతు పరిరక్షణ కార్యక్రమాలపై జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంతరించిపోతున్న, అరుదైన జాతుల వివిధ జంతువులకు ప్రసిద్ధి చెందిన ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల చరిత్ర, ప్రాముఖ్యతను డాక్టర్ నందనీ సలారియా వివరించారు. వన్యప్రాణుల సంరక్షణలో జూల పాత్ర, బాధ్యతలపై తమకు అవగాహన, అమూల్యమైన అనుభూతి కలిగిందని ప్రొబెషనర్లు వెల్లడించారు. కార్యక్రమంలో జూ అధికారులు మంగమ్మ, గోపి, గోపాల నాయుడు, భారతి, రాజేష్, జూ ఎడ్యుకేషన్ బృందం పాల్గొంది.

ప్రకృతి విధాన సాగు పైర్లను

ఐడబ్ల్యుఎంఐ బృందం సందర్శన

తర్లువాడలో పంటపొలాలను పరిశీలిస్తున్న ఐడబ్ల్యుఎంఐ బృందం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటపొలాలను ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్మెంట్ ఇనీషియేటివ్ ఐడబ్ల్యుఎంఐ బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఐడబ్ల్యుఎంఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మార్క్ స్మిత్, భారత ప్రతినిధి డాక్టర్ అలోక్ సిక్కా పాల్గొని, తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న రైతులతో సమావేశమై సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు, రీజనల్ అధికారులు ప్రకాశరావు, కృష్ణారావు, హేమసుందర్, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నేచురల్ ఫార్మింగ్ జిల్లా అసోసియేట్లు, సిబ్బంది పాల్గొన్నారు

లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు

శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని, త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్కుమార్ అన్నారు. శనివారం జివిఎంసి 60వ వార్డు ఇందిరాకాలనీ-2 సచివాలయం వద్ద క్లస్టర్ అధ్యక్షులు అంగ రాంప్రసాద్, నరేష్, ఆడారి హరీష్, బిల్డర్ శ్రీను, మళ్ల ధనలత ఆధ్వర్యంలో రూ.14.45 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు అలాగే, బర్మా కాలనీ దుర్గాదేవి గుడి దగ్గర రూ.19.80 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ పరిధిలో మౌలిక సౌకర్యాల కల్పనకు, గడపగడపలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్టియు జిల్లా నాయకులు కలిదిండి బద్రీనాథ్, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపల చెరువులో వ్యర్థాల తొలగింపు

మంచినీటి చేపల పెంపకంతో దుర్వాసన రాదు : మత్స్యకారులు

వ్యర్థాలను తొలగిస్తున్న సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస, చిల్లపేట పెద్దచెరువులో మంచినీటి చేపపిల్లల పెంపకం వల్ల ఎటువంటి దుర్వాసన రాదని తాటితూరు స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సింగిడి గణేష్, కార్యదర్శి అప్పలరాజు, సభ్యులు రవి స్పష్టం చేశారు. శనివారం చెరువులోని గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను సొసైటీ సభ్యులు తొలగించారు దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు సంబంధిత చెరువును జెడ్పి పరిశీలించారు.

ఈ సందర్భంగా చేపల పెంపకంతో దుర్వాసన రాదని, కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు, అపార్ట్మెంట్ల వాడుక నీరు చెరువులోకి చేరడం, చెరువులోని అదనపు నీరు బయటకు వెళ్లేందుకు నిర్మించిన మూడు మదుములను రియల్టర్లు మూసేయడం కూడా ఈపరిస్థితి కారణమన్నారు. వాటన్నింటినీ వదిలి చేపల పెంపకంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు .1988 నుంచి మత్స్యశాఖ అనుమతితో ఫింగర్ లింగ్ సైజు మంచి నీటి చేప పిల్లలను పెంచుతూ వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఈ ఏడాది జూన్లోనూ రూ.7లక్షల విలువైన మంచి నీటి చేప పిల్లలు వేశామని, ఫిబ్రవరి లో పంట చేతికి వస్తుందన్నారు.

పలు వార్డుల్లో గడపగడపకూ...

బ్రోచర్లు అందజేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 25వ వార్డు శాంతిపురంలో స్థానిక కార్పొరేటర్ సారిపల్లి గోవింద ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రభుత్వంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పాల్గొని, ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి చేయూతనివ్వాలని కోరారు.

ఆరిలోవ : 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో శనివారం శ్రీలీలాసుందరయ్యనగర్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి తూర్పు సమన్వయకర్త, ఎంపి ఎంవివి సత్యనారాయణ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్తి మందా రెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, అల్లంపల్లి రాజబాబు, పతి వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం, 47వ వార్డు రాంజీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి పర్యటించారు. యుపిహెచ్సిని పరిశీలించి, ప్రారంభ ఏర్పాట్లపై చర్చించారు. నాడునేడు నిధులతో అభివృద్ధి చేసిన జివిఎంసి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు..మౌలిక వసతులపై ఉపాధ్యాయులు, పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఇఇ భరణి, ఎఇఇ చాణుక్య, నాగేశ్వరరావు, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, నాయకులు సుకుమార్, గురువోజి, జయకుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎస్టిఎల్లో ముగిసిన టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - కరాస : ఎన్ఎస్టిఎల్ ప్రాంగణంలో నిర్వహించిన డిఆర్డిఒ సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్లో ఎన్ఎస్టిఎల్తో సహా తొమ్మిది జట్లుకు చెందిన 102 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్లో హైదరాబాద్కు చెందిన హైదరాబాద్ నుండి అడ్వాన్స్డ్ సిస్టం లేబరేటరీ (ఎఎస్-ఎల్) టీం ఛాంపియన్షిప్ను కైవసం చేసుకోగా, హైదరాబాద్కే చెందిన మరో ప్రయోగశాల రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్సిఐ) రన్నరప్గా నిలిచింది. టోర్నీలో సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (సిహెచ్ఇఎస్ఎస్), డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబరేటరీ (డిఎల్ఆర్ఎల్) , డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లేబరేటరీ (డిఆర్డిఎల్) , డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లేబరేటరీ (డిఎంఆర్ఎల్), బాలాసోర్ నుండి ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్), ప్రూఫ్ అండ్ ఎక్స్పెరిమెంటల్ ఎస్టాబ్లిష్మెంట్ (పిఎక్స్ సి) జట్లు పాల్గొన్నాయి. ఎపి టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్కు అనుబంధంగా ఉల్లాసభరితమైన వాతావరణంలో టోర్నీని ముగించారు.

చట్టాలపై న్యాయ అవగాహన

న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బివికె.కళాశాల విద్యార్థులకు శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ ఆధ్వర్యంలో పలుచట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి. ఆనంది, జువెనైల్ జస్టిస్ యాక్ట్, పోక్సో యాక్ట్, రూల్స్ గురించి వివరించారు. రెండవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎ.వి.యల్. హిమబిందు, పిల్లల నేరాల నివారణ, నిర్బంధానికి ప్రత్యామ్నాయాలు, కస్టడీయేతర ప్రత్యామ్నాయాలు, పునరావాసం, పునరుద్ధరణ పద్ధతులు, న్యాయపరమైన విచారణ, పిల్లల స్నేహపూర్వక విధానాలకు హక్కు, నేర బాధ్యతకు కనీస వయస్సు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 చట్టంలో వివిధ అంశాలను వివరించారు. విద్యార్థులు, ర్యాగింగ్ పాల్పడితే విధించే శిక్షలు, జరిమానాలు గురించి వివరించారు. కార్యక్రమంలోబివికె. కాలేజీ కరెస్పాండెంట్ వై. శ్రీధర్, ప్రిన్సిపల్ డివిఎల్ఎన్, జోగిరాజు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే నెల 9న జాతీయ లోక్అదాలత్

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

ప్రజాశక్తి -గాజువాక: వచ్చేనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసే చర్యలు తీసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు కోరారు. శనివారం గాజువాక కోర్టు సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ లోక్అదాలత్లో అన్ని రకాల సివిల్, క్రిమినల్ వివాదాలను, ఇన్సూరెన్స్, రెవెన్యూ కేసులను పరిష్కరించుకోవచ్చునని, కక్షిదారులు వినియోగించుకొని సంబంధిత కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవి స్వామి, కోశాధికారి పల్లా శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఇ.గిల్బర్ట్, ఎం పార్థశీలం, ఆర్ సూర్యనారాయణ, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు కోటేశ్వరరావు, శంకర్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మద్దతిస్తూ వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరగనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్‌ను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, జి.శ్రీరామ్, వి.వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణతో కలిసి అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, విశాఖ రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. మరో వైపు రాష్ట్రాల హక్కుల్ని హరిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలను రుద్దుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ కలెక్టరేట్ : విజయవాడలో ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించే ప్రజా రక్షణ భేరి యాత్ర సభ పోస్టర్‌ను శనివారం భవన నిర్మాణ సంఘం (సిఐటియు) నాయకులు కె.నరసింగరావు ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు ఆవిష్కరించారు. మహారాణి పేట వద్ద కొండారావు ఆధ్వర్యాన, సింగ్ హోటల్ జంక్షన్ వద్ద సింగ్ నాయుడు, జనార్దనరావు, నాయుడు సురేష్, వెంకట లక్ష్మి ఆధ్వర్యాన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.నరసింగరావు మాట్లాడుతూ, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి మతోన్మాదానికి మద్దతు ఇచ్చిన పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. రాబోయే కాలంలో వామపక్షాలే ప్రత్యామ్నాయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెవిపి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

దేవరాపల్లి : ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వాలాబు, వెంకటరాజుపురం, గర్సింగి పంచాయతీల్లో వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జి.గురువులు, సిహెచ్ లక్ష్మణ, కె.సన్యాసి, డి.నూకలు, కె సుదర్శన్, కె సుధాకర్, సిహెచ్.దేముడు, కె ఈశ్వరరావు, సిహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లిలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు గండి నాయనబాబు, ఎర్రా దేముడు పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్లి, జోగన్నపాలెం, కింతాడ, చంద్రయ్య పేట, కె సంతపాలెం గ్రామాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి ప్రసాదు, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో మహిళలతో శనివారం సమావేశం నిర్వహించి ప్రజా రక్షణ భేరిపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డిడి. వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర బిజెపికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా దాసోహమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, మహిళలు ఎం.మాణిక్యం, ఎం.దేవి, పి.సన్యాసమ్మ, కొండమ్మ, రమణమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, శ్రీదేవి, ఉమా, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం డివిజన్ కన్వీనర్ ఆర్ రాము పిలుపునిచ్చారు. శనివారం ఆయన బస్సు యాత్రపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 గంటలకు బస్సు యాత్ర అచ్యుతాపురం చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కె సోమనాయుడు, బుద్ధ రంగారావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న డి.డి.వరలక్ష్మి

7 నుంచి బాలల సైన్స్ కాంగ్రెస్

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో ఈ నెల 7 నుండి జరిగే 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ -2023 పోటీలను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ పిలుపునిచ్చారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలు రెండు దశలలో జరుగుతాయని, మొదటి దశలో మండల స్థాయి పోటీలు ఈనెల 7న నాలుగు వేదికల ద్వారా జరుగుతాయని తెలిపారు. అనకాపల్లి జివిఎంసి బాలిక హైస్కూల్, నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులలో ప్రతి ఉప అంశం నుండి అత్యుత్తమైన 20 శాతం ప్రాజెక్టుల ఎంపికచేసి ఈనెల 9న కసింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన బాల శాస్త్రవేత్తలు పాల్గొంటారని చెప్పారు. ఒక ప్రాజెక్టు గైడ్ టీచర్‌తో పాటు, ఇద్దరు విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న వాటిలో అత్యుత్తమైనవి 7 ప్రాజెక్టులు ఎంపికచేసి ఈ నెల 29, 30 తేదీలలో విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఇతర వివరాలకు అప్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ పి.రాజారావు 9490662662 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చాకిపల్లి గ్రోయిన్ పరిశీలన

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని చాకిపల్లి గ్రోయిన్‌ను జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు, పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే గ్రోయిన్ మరమ్మతు పనులు చేయాలని, రైతులు కష్టాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జి.మూలు నాయుడు, అల్లం రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి : నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు అందుకోలేని స్థాయికి ధరలు పెరిగిపోయాయన్నారు. బియ్యం కొనుక్కోలేక, రేషన్ బియ్యం తినలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిత్యావసర వస్తు ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజులు, పల్లా సత్యఅప్పారావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-చోడవరం : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండిస్తూ పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో శనివారం చోడవరం కొత్తూరు జంక్షన్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి సియాద్రి రుద్రి మాట్లాడుతూ దశాబ్దాలుగా పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద అమెరికా అండతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులలో వేలాది మంది పాలస్తీనా ప్రజలు చనిపోయారని తెలిపారు. ఈ దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఓ నాయకులు రాజేష్ , నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్లు

◆ ఎర్రగా మారి చనిపోతున్న వైనం

◆ ఆందోళనలో రైతులు

తెగుళ్లు కారణంగా చచ్చిపోతున్న వరి పంట

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంట తెగుళ్ళ బారిన పడింది. ఎకరాలకు ఎకరాలు వరి పంట నాశనమైంది. దీంతో రైతులు లబోదిబోమంటూ గుండెలను బాదుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడడంతో ఈ పరిస్థితి దాపురించింది.

మండలంలో ఈ ఏడాది 1983 హెక్టార్లో వరి సాగు జరిగిందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ నారుమడులు సకాలంలో వేసినప్పటికీ ఆగస్టులో వర్షాలు తక్కువగా ఉండటంతో పూర్తిస్థాయిలో నాట్లు పడలేదు. వల్లపు గ్రామాలలో బోరు బావులు, చెరువులు, నీటి సౌకర్యం ఉన్నచోట వరి నాట్లు వేశారు. సెప్టెంబర్‌లో అడప దడపా వర్షాలు కురవడంతో రైతులు ఆశలు చిగురించాయి. అక్కడక్కడా వరినాట్లు వేశారు. వర్షాలు తక్కువగా కురవడంతో కె.కోటపాడు, కింతాడ, కె.సంతపాలెం, ఆర్వై అగ్రహారం, గొండుపాలెం, గుల్లేపల్లి, ఆనందపురం తదితర గ్రామాలలో వరి నాట్లు వేయలేదు. కొన్ని గ్రామాల్లో వేసిన పంటలు కూడా వర్షాలేకపోవడంతో సాగునీరు లేక ఎండిపోవడంతో పాటు పంట తెగుళ్ల బారిన పడింది.

అన్ని పంటల కన్నా వరి పంటకు నీరు సమృద్ధిగా ఉండాలి. అయితే అక్టోబర్ మొత్తం వరుణుడు ముఖం చాటేయడంతో నీరు లేక వరి పంట ఎండిపోయే స్థితి వచ్చింది. బోరుబావుల ద్వారా పంటలను రైతులు రక్షించుకోగా, వర్షాలు లేక, వేసవిని తలపించే విధంగా ఎండలు కాయడంతో పెద్ద ఎత్తున తెగుళ్ల సోకి పంటలు నాశనమయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆకు ముడత, పాము పడ, అగ్గి తెగులు, దోమకాటు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో ఏ తెగులు వచ్చినా ఒక రోజుకే పంట అంతా ఎర్రగా అయిపోయి చచ్చిపోతుంది. దీంతో రైతులు ప్రతిరోజూ వరి మడుల వద్దకు వెళ్లి పొలాన్ని పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతులు ఇప్పటికే 8 నుంచి పదిసార్లు వివిధ తెగుళ్లకు మందులు పిచికారీ చేశారు. ఒక ఎకరానికి పురుగు మందు పిచికారీ చేయాలంటే రూ.1500 నుంచి రెండు వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఒక ఎకరానికి పది నుంచి 15 ట్యాంకులు వరకు మందు పిచికారీ చేయాలి. రైతు సొంతంగా మందు పిచికారీ చెయ్యకపోతే ఒక ట్యాంకు మందు పిచికారీ చేయడానికి రూ.50 చొప్పున చెల్లించి వేరే వారిచే చేయించుకోవాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ ప్రతిరోజు మండలంలో ఏదో గ్రామానికి వెళ్లి అక్కడ వరి పంటలను పరిశీలించి రైతులకు తెగుళ్ల పై అవగాహన కల్పించి మందులను ఏ మోతాదులో ఏయే మందులు పిచికారీ చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో పురుగులు నియంత్రించబడలేదు. ఇప్పటికే పురుగులు వలన కొన్ని గ్రామాల్లో వరి పంటలు నాశనమయ్యాయి.

ఈ ఏడాది రైతులు ఆర్‌జిఎల్, బీపీటీలు ఎక్కువగా సాగు చేశారు. 1121 రకము వరి పంటలు సాగు చేసినట్లయితే ఆ రకము అన్ని రకాల తెగుళ్లను తట్టుకుంటుందని మండల వ్యవసాయ అధికారి రైతులకు వివరిస్తూ పాత రకాలకు స్వస్తి పలకాలని చెబుతున్నారు.

ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల వలన ఆకు ముడత తెగులు ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ తెగుళ్ళ ఎక్కువగా ఉన్నట్లయితే పంట పూర్తిగా నాశనం ఆగడంతో పాటు ఉన్న కొద్దిపాటి ఎన్నులు కూడా కంకులుగా మారుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క తెగుళ్ల వల్ల వరి పంట ఆకులన్నీ ఎర్రగా మారి చనిపోతుంది. ఇప్పకైనా ప్రభుత్వం స్పందించి క్రిమి కీటకాలను నాశనం చేసే మందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై అందించినట్లయితే కొంతవరకు ఊరట లభిస్తుందని రైతులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు

మండలంలో గతంలో చెరుకు ప్రధాన పంట ఉండగా సుగర్ ఫ్యాక్టరీ పేమెంట్లు సకాలంలో ఇవ్వకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో వరి పంట వైపు రైతులు మళ్లారు. కానీ ఏడాదికి ఏడాదిగా క్రిమి కీటకాలు ఎక్కువై వరి పంటను పట్టిపీడించడంతో రైతులు క్రమేపి వరి సాగుకు స్వస్తి పలికి వేరే ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లే అవకాశాలు కనపడుతున్నాయి. ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామంలో వరి పంటల పండే భూములు ఉన్నప్పటికీ రైతులు ఖాళీగా ఉంచారు. కొందరు సరుగుడు తోటలు వేశారు.

ఎంవిఆర్‌ను కలిసిన సేవా సమితి సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : నిత్యం సేవా కార్యక్రమాలు చేసే ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)ను తోటాడ సిరసపల్లి, తాడి గ్రామాలకు చెందిన శ్రీవారి మహిళా సేవకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టిటిడి తరపున నిర్వహించే కార్యక్రమాలకు హాజరు కావాలని ఎంవిఆర్‌ను అభ్యర్థించారు. అలాగే బుచ్చయ్యపేట మండల పరిధి కరక గ్రామ పెద్దలు ముత్యాల వెంకటేశ్వరరావును పట్టణంలోని నర్సింగరావుపేటలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ వైపు అడుగులు వేసినా, మీ వెన్నంటే ఉండేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌తో సేవా సమితి సభ్యులు

వారోత్సవాల్లో పాల్గొన్న సంస్కృతి పాఠశాల విద్యార్థులు, సిబ్బంది

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి - పరవాడ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థుల్లో సామాజిక చైతన్యం తీసుకురావడానికి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ. అవినీతిపై పోరు పాఠశాలల్లోనే ప్రారంభం కావాలన్నారు. ప్రజా జీవితంలో సమగ్రతను ప్రోత్సహించడానికి, అవినీతి రహిత సమాజాన్ని సాధించడానికి అవినీతిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు నిజాయితీగా బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలని కోరారు. తరువాత అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేస్తు అవినీతి వ్యక్తులతో సహవాసం వల్ల వచ్చే పర్యావసానలపై నాటక ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈఓ కె.నిశంత్, సమన్వయకర్త రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఏపీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్న క్యాబినెట్ నిర్ణయం హర్షణీయమని ఏపీయూడబ్ల్యూజె అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు కొయిలాడ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చాగంటి సర్వారావు (అవ్వ), కోశాధికారి డి.రామచంద్రరావు, కార్యవర్గ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులందరికీ మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం శుభ పరిణామమన్నారు. ఏపీ క్యాబినెట్‌కి ప్రెస్ క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

చిత్రలేఖనం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : చిత్రలేఖనం చరిత్రకు సజీవ సాక్ష్యాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం చిత్రకళా నిలయం నిర్వాహకులు బొడ్డేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ సమాజంలో ఆరవ జాతీయ చిత్రలేఖన పోటీలను శనివారం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం మానవ పరిణామక్రమం మొదటి నుండి ఏర్పడిందన్నారు. దేశ చరిత్ర సంప్రదాయాలకు చిత్రలేఖనం ఎంతో దోహదపడిందని నేటితరం చిత్రలేఖులుగా తయారుకావాలని కోరారు. దేశం నలుమూలల నుండి చిత్రకారులు పంపించిన చిత్రాలను 80 చిత్రాలను ప్రదర్శించారు. 200 మంది పిల్లలు పంపిన 2,400 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపకులపతి ముర్రు ముత్యాల నాయుడు, చోడవరం సుగర్ ఎమ్‌డి వి సన్యాసినాయుడు, డైరెక్టర్ డిఎస్ ప్రసాద్, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఒరుగంటి నెహ్రూ, పుల్లేటి వెంకట్రావు, పుత్రేవ్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో అగనంపూడి హోమి బాబా కేన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ దాడి జగన్ ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ తరుణ్, డాక్టర్ హర్షిత 61 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరికి ఓరల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వకల్ కేన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్, పిఎసిఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, పోలిపిరెడ్డి రమణ, వేచలం పిహెచ్‌సి వైద్యాధికారి బి.హారిక, వైద్య సిబ్బంది, అగనంపూడి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాణసంచా తయారీదారులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- సబ్బవరం

రానున్న దీపావళి పండుగ దృష్ట్యా గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా నిబంధనలు అతిక్రమించి బాణసంచా తయారు చేయడం గాని, విక్రయించడం గాని జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరవాడ సబ్ డివిజన్ పరిధిలో గతంలో బాణసంచా తయారీలో 125 మంది అరెస్టు కాగా అందులో 93 మందిని బైండోవర్ చేశామని, 18 మందిని ఇంకా చెయ్యవలసి ఉందని చెప్పారు. అయితే వారి 11 మంది చనిపోగా, 13 మంది ఇతరప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించామన్నారు. సబ్బవరం మండలంలో బాణ సంచా తయారీలో గతంలో 35 మందిని అరెస్ట్ కాగా, అందులో 30 మంది బైండోవర్ చేయగా ఐదుగురు చనిపోయారన్నారు. అంతకుముందు మండలంలోని గుల్లెపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, గంగవరం గ్రామాల్లో బాణ సంచా తయారు కేంద్రాలను పరిశీలించి, లైసెన్సు తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ పి.రంగనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక 80వ వార్డు గవరపాలెం అరుంధతి నగర్, 23వ సచివాలయం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి సందర్శించి పరిశీలించారు. శిబిరంలో అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులను ఎంపి చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్చార్జ్ కొణతాల భాస్కర్, వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎంపి డాక్టర్ సత్యవతి

సీతమ్మధార : ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు అన్నారు. శనివారం 47వ వార్డు కప్పరాడ యుపిహెచ్‌సి, 45వ వార్డు వాసుదేవనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన.జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పర్యవేక్షించారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యసేవలతోపాటు మెరుగైన వైద్యానికి ఆరోగ్యశ్రీ, ఇంకా అవసరమైతే సిఎం సహాయనిధి ద్వారా ప్రజలకు భరోసాగా ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, జెసిఎస్ మండల కన్వీనర్ వసంత అప్పారావు, నాయకులు హరిపట్నాయక్ పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై ప్రచారం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కశింకోట

కసింకోట మండలం పల్లపు సోమవారం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారంటీ - ఇది బాబు షూరిటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నైయినంశెట్టి రమణారావు, ఉలింగల రమేష్ , జెర్రిపోతల నూకు నాయుడు. నారి పిల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ కర్రి దురుగు నాయుడు, బుదిరెడ్డి వీరు నాయుడు, తిర్రి సురేష్, బుదిరెడ్డి బాబురావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీలోని గచ్చపు వీధిలో మాజీ ఎంపిటిసి, తెలుగుదేశం నాయకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందచేసి మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- సబ్బవరం : అనకాపల్లి క్లస్టర్ పరిధిలోని మండలాల ఉపాధి హామీ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక ఎంపిడిఓ బి.రమేష్ నాయుడు అధ్యక్షతన శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న క్లస్టర్ అధికారి జె.మణికుమార్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను ప్రతి గ్రామంలో కొత్త పనులను ఉపాధి పథకం కింద గుర్తించాలని సూచించారు. ప్లాంటేషన్, ఫీడర్ చానల్స్, ఫీల్డ్ చానల్స్ తదితర పనులను ఆయా పంచాయితీ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్లానింగ్ చేయాలన్నారు. పనులకు సంబంధించి ప్రణాళికలు తయారు చేయాలని, పనులను గుర్తి శాస్త్రీయంగా అధ్యయనం చెయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్లస్టర్ అధికారి మణికుమార్

మాట్లాడుతున్న టిడిపి నేత నాగజగదీశ్వరరావు

టిడిపి ఓట్లు తొలగింపునకు కుట్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపునకు వైసిపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్ శెట్టి విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాను తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ కమిటీలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఉద్దేశంతో పార్టీ సానుభూతిపరులు ఓట్లను తొలగించేందుకు అధికార యంత్రాంగాన్ని, అధికారులను, అడ్డం పెట్టుకొని కుట్ర చేస్తుందన్నారు. వైసిపి నాయకులు ఫారం-7ను అస్త్రంగా వాడుకొని పేర్లు తొలగిస్తారని, ఓట్లు తొలగింపు జరగకుండా దేశం పార్టీ బూతు లెవెల్ ఏజెంట్లు సర్వే చేసి అవకతవకలు ఏమైనా ఉంటే, ఈ సమాచారం పార్టీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే రోలుగుంట మండలం కొవ్వూరులో ఐటిడిపి ఫిర్యాదుతో బూత్ లెవెల్ ఆఫీసర్, వీఆర్ఏలపై వేటు పడిందని, కనుక ఫారం 7 దరఖాస్తులపై పార్టీ శ్రేణులు దగ్గర ఉండి విచారణకు డిమాండ్ చేయాలని సూచించారు. సమావేశంలో కుప్పిలి జగన్, బోడి వెంకటరావు, గుడాల సత్యనారాయణ, భర్నికాన శ్రీను, పూడి త్రినాథ్, వి.రమణ బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... జిల్లాలోని మాకవరపాలెం మండలం, జి కోడూరు గ్రామానికి చెందిన తోట అప్పారావు (42) బైక్‌పై యలమంచిలి మండలం వెంకటాపురంలో వివాహానికి వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా, తాళ్లపాలెం జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి రివైడర్ ఢీకొట్టారు. దీంతో బలమైన గాయాలు కావడంతో ఆయన్ను 108 వాహనంలో అనకాపల్లి వైద్యాలయానికి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్ తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం అప్పారావు మృతి చెందారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి గుడి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దొండ రాంబాబు, స్థానిక సర్పంచ్ కోవెల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగునాయుడు పాలెంలో శ్రీకృష్ణుడి ఆలయం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలో పరవాడపాలెం గ్రామ శివారు ఉగ్గిన గంగునాయుడు పాలెం గ్రామంలో శ్రీ కృష్ణుడు ఆలయం నిర్మాణానికి శనివారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గొంతిన శ్రీనివాసరావు రూ.50వేలు చెక్కును మాజీ ఎమ్మెల్యే పీలా చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు. అనంతరం వారిని యాదవ సంఘం యువకులు, మహిళలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుద్దిరెడ్డి అప్పడు, బుదిరెడ్డి గంగయ్య, సిదిరెడ్డి సూర్యనారాయణ, షేక్ బాబర్, నైనంశెట్టి రమణ రావు, ఉల్లింగల రమేష్ పాల్గొన్నారు.

పైడితల్లమ్మ గుడికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

నక్కపల్లిలో వర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పలుచోట్ల శనివారం కొద్దిపాటి వర్షం కురిసింది. శనివారం ఉదయం 10 గంటల సమయంలో అరగంట సేపు వర్షం కురిసింది. దీంతో, రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. భారీ వర్షం కురిస్తే వరికి ఊపిరినిచ్చినట్లు అవుతుందని రైతులు భావించారు. వరుణుడు కొద్ది సమయానికే నిష్క్రమించాడు. దీంతో, రైతులు నిరాశ చెందారు.

దగ్ధమవుతున్న పూరిల్లు

జేబిపురంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలోని జేబి పురం గ్రామంలో షార్ట్ షర్క్యూట్‌తో గ్రామానికి చెందిన రాకోటి చిన్నమ్మల పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదం జరిగినప్పటికీ ఇంటి దగ్గర ఎవరూ లేక పోవడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. చిన్నమ్మలు భర్త చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిపి అదే నివాసంలో నివసిస్తుంది. ఈ ప్రమాదంతో వస్తువులు, బట్టలు దగ్ధమై నిరాశరాయులయ్యారు. ప్రమాద సంఘటన తెలుసుకొని సర్పంచ్ చెన్నమ్మలు రాజబాబు, ఎంపీటీసీ స్వాతి కొండబాబు పరామర్శించారు.

కందిపప్పు సరఫరా కలేనా..

అరకొరగానే గోధుమపిండి

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా గొప్పగా ఏర్పాటు చేసుకున్న రేషన్ వాహనాలు కేవలం ప్రచారానికి పరిమితం అవుతున్నాయి. ప్రతి నెల తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులు అందజేయాల్సి ఉండగా కేవలం బియ్యం పంచదారతో సరి పెట్టేస్తుంది. అసలే ప్రస్తుతం పండుగల కాలం కనీసం ప్రభుత్వం కందిపప్పు కూడా సరఫరా చేయలేదు.గడిచిన ఆరు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిపి వేయడంతో తెల్ల రేషన్ కార్డులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లో కిలో కందిపప్పు రూ.200 నుంచి 250 వరకు ధర ఉంది. ప్రభుత్వం సరఫరా చేసే కందిపప్పు కనీసం 70 రూపాయలకు వచ్చేదని, ప్రస్తుతం మార్కెట్లో అధిక ధరకు కొనుక్కోలేక అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గత నెల నుంచి ఇస్తున్న గోధుమపిండి సైతం అరకొరగానే సరఫరా చేస్తున్నారు. దీంతో, రేషన్ బండి నిర్వాహకులకు సైతం ఏమి చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సరుకులు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై హర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి:రాష్ట్రంలో అక్రిడేషన్ జర్నలిస్టులందరికీ 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో జర్నలిస్టులు హర్ష వ్యక్తం చేశారు. ఏపీడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆచంట రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, జర్నలిస్టులు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో .జర్నలిస్టులు దవరసింగి రాంబాబు, మహేష్, మురళి, నరిశే హరి ప్రసాద్, రమణ, కుమార్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

రావికమతం:రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ కొనియాడారు. రావికమతం మండల కేంద్రానికి శనివారం వచ్చిన ధర్మశ్రీని పాత్రికేయుల సంఘం ప్రతినిధులు కేతవరపు శ్రీను, మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఇల్లపు చిన సత్యనారాయణ సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్న పాత్రికేయులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఎంపీపీ పైలరాజు, మండల కన్వీనర్ కే.జగన్నాధరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముక్క మహాలక్ష్మి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దేవా, మాజీ జడ్పిటిసి వాసు గోవిందరావు, పాత్రికేయులు శ్రీనివాసరావు, వరహాలు, లోవరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల విశాఖ అక్రిడిటేషన్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ హర్షం వ్యక్తం చేసింది. సొసైటీ కార్యవర్గం ఇచ్చిన వినతి మేరకు క్యాబినెట్ సమావేశంలో టేబుల్ అజెండాగా ఈ అంశాన్ని చేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం శనివారం సొసైటీ అధ్యక్షుడు బి. రవికాంత్ అధ్యక్షతన నగరంలో నిర్వహించారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ త్వరితగతిన జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సొసైటీలో సభ్యులుగా ఉన్న ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలం సాధించే దిశగా కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. సొసైటీ గౌరవాధ్యక్షులు కెజి.రాఘవేంద్రరెడ్డి, జి.జనార్ధనరావు, సలహాదారులు పాల్గొన్నారు.

న్యూ మోడల్ డిగ్రీ కళాశాలకు దరఖాస్తు

ప్రజాశక్తి - మాడుగుల: పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం 'పి ఎమ్ ఉష ' ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్ష అభియాన్) పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం కింద శనివారం మాడుగులలో న్యూ మోడల్ డిగ్రీ కళాశాలకు దరఖాస్తు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి తెలిపారు. . ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్ష అభియాన్ లో భాగంగా న్యూ మోడల్ డిగ్రీ కళాశాల నిర్మాణం మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, దీనికి అనుగుణంగా కావలసిన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తహసిల్దార్ పీవీ రత్నం సహకారంతో మండల రెవెన్యూ సిబ్బంది కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి వాటి జియో కోఆర్డినేట్స్, ఇతర వివరాలు అందించినట్లు శాస్త్రి తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ సిబ్బందితో స్థల పరిశీలన చేసినట్లు కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ పులవర్తి పైడిరాజు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వాలంటీర్ కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో శనివారం అందజేశారు. మున్సిపాలిటీ 5వ వార్డ్‌కు చెందిన భోజా భాను ప్రకాష్ వాలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల కరెంట్ షాక్ గురై మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 5లక్షల చెక్కు ను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ వైసీపీ ప్రెసిడెంట్ యాకాశివ, తమరాన శ్రీను, బేతిరెడ్డి విజయ్ పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నాన్ని కరువు మండలంగా గుర్తించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కృష్టాపురం పరిసర ప్రాంతాల్లో వరి పొలాలను రైతులతో సందర్శించారు. తాండవ జలాశయం అధారిత కృష్టాపురం, మెండికండి తదిర గ్రామాల వరి పొలాలు నీరు లేక బీటలు బారి ఎండి పోయాయన్నారు. ఎకరాకు రూ.40వేలకు పైగా పెట్టుబడులు పెట్టి రైతులు నష్టపోయారని అవేదన వ్యక్తం చేసారు. ఈ ఏడాది వర్షాలు లేక పంటలు ఎండి పోయాయని, అధికారులు పరిశీలించాలని కోరారు. తాండవ జలాశయం గేట్లు మరమ్మత్తుకు గురవడంతో వేల క్యూసెకుల నీరు వృథాగా పోయిందని తెలిపారు.

పట్టపగలే వీధిలైట్ల వెలుగులు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో కసిరెడ్డిపాలెం, రోలుగుంట జగనన్న కాలనీలకు పట్టపగలు వీధిలైట్లు వెలుగుతున్నాయి. గుండుబాడు శివారు గ్రామం కసిరెడ్డిపాలెం, రోలుగుంట జగనన్న కాలనీలో వీధిలైట్లు పట్టపగలు వెలుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు.. రోలుగుంట జగనన్న కాలనీలో ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదు. వీధిలైట్లు మాత్రం పగలు, రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వీధిలైట్లు వెలుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

వెలుగుతున్న లైటు

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- పలుచోట్ల ఓటర్ల నమోదు కేంద్రాలు

పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కశింకోట :: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా శనివారం ఆయన కసింకోట మండలం నర్సింగబిల్లిలో ఓటరు నమోదు కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఆధార్ కార్డు, ఇతర రుజువులతో ఆ కేంద్రం పరిధిలో గల 18 సంవత్సరాలు నిండిన వారెవరు వచ్చినా వెంటనే వివరాలను పరిశీలించి అవసరమైన దరఖాస్తు ఫారం లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దార్ సురేష్ నాయుడు పాల్గొన్నారు.

కశింకోట : అర్హులందరూ ఓటరు లిస్టు చూసుకోవాలని ఉప తహశీల్దారు సురేష్ నాయుడు అన్నారు. స్థానిక బాలురు హైస్కూల్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ యన్ రమేష్ స్థానికలు పాల్గొన్నారు.

సబ్బవరం : ఈ నెల 4, 5 తేదీలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి నియోజకవర్గ ఈఆర్ఓ పి.శేషశైలజ అన్నారు, మండలంలోని సబ్బవరం, మల్లునాయుడు పాలెం, మొగలిపురం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె శనివారం పరిశీలించి, బిఎల్ఓలను ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ బి.సత్యనారాయణ, ఎమ్‌పిడిఓ బి రమేష్ నాయుడు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట, పోలేపల్లి, కందిపూడి తదితర గ్రామాల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని శనివారం తహశీల్దారు అరుణ్ చంద్ర పరిశీలించారు. ఓటర్ నమోదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించిన ఆర్డిఓ

నర్సీపట్నంటౌన్: డివిజన్లో ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాలను శనివారం ఏర్పాటు చేశారు. వీటిని నర్సీపట్నం ఆర్డిఓ జయరామ్, తహశీల్దార్ అన్నాజీరావు పరిశీలించారు. వేములపూడి, బలిఘట్టం ప్రాంతాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించి ఆయన మాట్లాడుతూ, సిబ్బంది పారదర్శకంగా పని చేయాలని, కొత్త ఓటర్లను నమోదు చేయాలని, చనిపోయిన వ్యక్తులను తొలగించేటప్పుడు నిజనిర్ధారణ సమాచారం తీసుకొని తొలగించాలని ఆయన అన్నారు.

కోటవురట్లలో పరిశీలిస్తున్న తహశీల్దార్

కోటవురట్ల:ఓటర్ ప్రత్యేక సవరణ క్యాంపెయిన్ మండల వ్యాప్తంగా 52 పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు నిర్వహించారు, తహసిల్దార్ జానకమ్మ పలు కేంద్రాలను సందర్శించారు.

పిఎం.పాలెం: ఓటర్ల నమోదు, సవరణ స్పెషల్ డ్రైవ్‌ను భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి పరిశీలించారు. శనివారం మధురవాడ, చంద్రపాలెం పాఠశాలలోని ఏడు పోలింగ్ బూత్‌ల పరిధిలో బిఎల్‌ఒల ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదు, ఫిర్యాదులు, తొలగింపులు, ఓటరు జాబితా తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. ఓటరు నమోదు చేసేటప్పుడు అన్ని ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు అందరికీ కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

మధురవాడ: చంద్రపాలెం, ఎన్‌జిఒ కాలనీ పాఠశాలలో ఉన్న నాలుగు బూత్‌లతోపాటు వాంబే కాలనీలోని ఏడు పోలింగ్ బూత్‌లలో ఓటర్ల జాబితా పరిశీలనను ఆర్‌డిఒ భాస్కరరెడ్డి పరిశీలించారు. తప్పులకు ఆస్కారం లేకుండా ఫారం6,7లను నమోదు చేయాలని బిఎల్‌ఒలకు సూచించారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్ -17 బాలబాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు రెండవ రోజు శనివారం కూడా ఎంతో ఉత్సాహంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, హాకీ క్రీడా మైదానంలో రెండవ రోజు పోటీలను ఎంఈఓ కే నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఏర్పాటు చేసి అనేకమంది విద్యార్థులను హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబును, ప్రధాన కార్యదర్శి కే.తాతాజీలను అభినందించారు. ఆదివారం మధ్యాహ్నంతో ఈ పోటీలు ముగుస్తాయని తెలిపారు. పలు జిల్లాల నుండి వచ్చిన జట్లు హెూరాహెూరిగా తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో బి.ఎస్.హాకీ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొల్నాటి తాతాజీ, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు నాయుడు, ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, వేమగిరి నూకరాజు, రాణీలలిత, బి.సత్యారావు, సత్తిబాబు, ప్రధానోపాధ్యాయులు, చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, చుక్కల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ ఔదార్యం

- కెజిహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి- వడ్డాది: బుచ్చయ్యపేట వడ్డాది గ్రామానికి చెందిన కోవెల రామకష్ణ కు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నాడు రామకష్ణ కు వికలాంగు పెన్షన్ అందించడానికి గ్రామ వాలంటరీ సింగంపల్లి ఝూన్సీ తన సొంత నిధులతో విశాఖపట్నం వెళ్లి పెన్షన్ అందించారు దాంతో ఆమెని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు అభినందించారు

కెజిహెచ్‌లో పింఛను ఇస్తున వాలంటీర్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ఓటర్ల జాబితాలను పరిశీలించాలి

ప్రజాశక్తి- రావికమతం: ఓటర్ల జాబితాలో తప్పుల తడకల సవరణకు ఇదే చివరి అవకాశం అయినందున బూత్ కమిటీ సభ్యులు ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వైఎస్‌ఆర్‌సిపి బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఇంటి పేర్లు, డోర్ నెంబర్లు, ఫోటోలు తప్పుగా నమోదైతే ఓటును తిరస్కరించే అవకాశం ఉందన్నారు. ఈ దృష్ట్యా ఓటర్ల జాబితాలో తప్పులను పరిశీలించి సవరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ముక్కా మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పలు కాలేజీల్లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. స్టార్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరముల నుండి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే క్యాన్సర్ క్యాంపు ద్వారా కొంతమంది రోగులను గుర్తించి వైద్యం, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు వంటి మెటీరియల్ అందిస్తున్నారు. స్టార్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్ పరీక్షలను పరిశీలించారు.ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, ఆర్‌సీఎం పాఠశాలలో 1986-87 సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న వారంతా ఒక సంఘంగా ఏర్పడి స్టార్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ంఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శర్మ, రాము పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎఒ

ఎండిన వరిపొలాల పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలో ఆర్.భీమవరం గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను శనివారం మండల వ్యవసాయ అధికారి బి.భాస్కరరావు, స్థానిక సర్పంచ్ బి.అమ్మ నాయుడు తదితరులు పరిశీలించారు. పూర్తిస్థాయిలో వర్షాలు లేక పోవడంతో పూర్తిగా వరి పంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్ట పోయామని పలువురు రైతులు తెలిపారు. వరి నాట్లు ఎండిపోయిన విషయాన్ని స్థానిక శాసనసభ్యులు దృష్టికి తీసుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సేనాపతి నాయుడు, పల్లెల ఈశ్వరరావు, గంగు నాయుడు పాల్గొన్నారు.

అనుమతి లేని బాణసంచా నిల్వలపై నిఘా

సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్

ప్రజాశక్తి -కొత్తకోట:జనావాసాల మధ్య అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వలపై నిఘా ముమ్మరం చేశామని కొత్తకోట సర్కిల్ సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ తెలిపారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ తనఖీకి శనివారం సాయంత్రం వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, దీపావళి పండగ సందర్భంగా సర్కిల్ పరిధిలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిఘా ముమ్మరం చేసామన్నారు. తమ సిబ్బందితోపాటు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కూడా ఈ నిఘాలో భాగస్వాములయ్యారని తెలిపారు. దీనిలో భాగంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో శనివారం భారీ స్థాయిలో బాణాసంచా నిల్వలు కనుగొని కేసు నమోదు చేశామన్నారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా, అనుమతులు లేకుండా బాణాసంచా తయారీ అమ్మకాలు జరపడం నేరమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. బాణాసంచా ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆవాసాల మధ్య తయారీ, అమ్మకాలు జరిపిన యెడల సంబంధిత వ్యక్తుల వివరాలు సమీపంలో పోలీస్ స్టేషన్, 100 నెంబర్ కు సమాచారం అందించాలని కోరారు.

వినూత్నంగా నిరసన తెలియజేస్తున్న పిల్లలు

జగనన్న గోరుముద్ద ఏదీ?

- గిరిజన పిల్లలు వినూత్న నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:తమకు జగనన్న గోరుముద్ద పథకం వర్తింపజేయాలని రోలుగుంట మండలం అర్ల పంచాయతీ పిత్రిగెడ్డ కొండశిఖర గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన పిల్లలు కంచం చేతపట్టి నోట్లో గడ్డి పెట్టికొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఇటీవల ఈ గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాలను మంజూరు చేశారు. పిత్రిగడ్డ, నీలిబంద గ్రామాల్లో 50 మంది జనాభా ఉండగా కొందు ఆదివాసి గిరినులు ఈ రెండు గ్రామా 19 మంది పిల్లలు ఉన్నారు. వీరు ఒకటి నుండి మూడో తరగతి వరకు పిల్లలు. వీరి నిమిత్తం సెప్టెంబర్ నెలలో స్కూల్ ప్రారంభించారు. జగనన్న గోరుముద్దల పథకం వర్తింపజేయలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మధ్యాహ్నం భోజనం పథకం వర్తింపచేయాలని కోరారు.

క్రాస్ బౌ షూటింగ్‌లో 18 పతకాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆగ్రాలో అక్టోబర్ 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ ఛాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు 18 పతకాలు సాధించారని భారత్ షూటింగ్ అకాడమీ డైరెక్టర్, కోచ్ గణేష్ తెలిపారు. ఎంవిపి.కాలనీలోని భారత్ షూటింగ్ అకాడమీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో తమ సంస్థ నుంచి 12 మంది సభ్యులు పాల్గొనగా 11 మంది 18 పతకాలు సాధించారని తెలిపారు. 9 బంగారు, 5 వెండి, 4 రజత పతకాలు సాధించారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 8 దేశాల నుంచి సుమారు 100 మంది షూటర్స్ పాల్గొన్నారని, భారతదేశం నుంచి 30 మంది షూటర్స్ పాల్గొనగా అందులో 12 మంది తమ అకాడమీలో శిక్షణ పొందినవారు ఉండటం తనకు సంతోషకరంగా ఉందని తెలిపారు. తమ సంస్థ నుంచి నసీర్ అలి, లోహిత్, నేహా పట్నాయక్, లోహిత్ పట్నాయక్, నాసర్ అలి, లోక్ జిత్, రవి కిరణ్, సాయి కౌశిక్, ప్రణతి కృష్ణ, అంబిక, అనిల్ వర్మ, త్రిలోక్‌నాథ్ పతకాలు సాధించారని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో భారత్ షూటింగ్ అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.10లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చోద్యం పిఏసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ తెలిపారు. గొలుగొండ మండలం రావణాపల్లి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తమ సచివాలయానికి 20లక్షల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో రూ.10లక్షలను కొమిర, మరో 10లక్షలు రావణాపల్లి పంచాయతీలకు కేటాయించడం జరిగిందన్నారు. రావణాపల్లి పంచాయతీకి కేటాయించిన 10లక్షలతో రూ.8లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణం, మరో రూ.2లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొల్లు రాము, కొల్లు బైరాగి, మడగల పైడియ్య, కొల్లు లోవరాజు, కొల్లు గంగునాయుడు, కొల్లు చినతాతాలు, చిన్నబ్బాయి పాల్గొన్నారు.

వడ్డిస్తున్న నిర్వాహకులు

నక్కపల్లిలో అన్నసమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి: స్థానిక వారపు సంత వద్ద దుర్గాదేవి ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టగా, చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

350 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 350 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విభూషణరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం వాహనాలు తనిఖీ చేయగా వైజాగ్ నుండి మహారాష్ట్రకు అశోక్ లేలాండ్ వాహనంలో ప్రత్యేక క్యాబిన్లు నిర్మించి ,వాటిలో గంజాయి ప్యాకెట్లను నింపి తరలిస్తున్నారు. వాహనం తనిఖీ చేయగా గంజాయి బయటపడడంతో వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. సిఐ అప్పన్న కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
అగనంపూడి, కూర్మన్నపాలెం, పూర్ణామార్కెట్, వన్‌టౌన్
అల్లిపురం, సాగర్‌నగర్, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం
సిరిపురం, ఎ.యు., క్రైం రిపోర్టర్, జిల్లా పరిషత్, రాంపురం
ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి రూరల్
ఇంటర్వ్యూ : తేది 14-11-2023 మంగళవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 94900 99125, 94915 70765
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రీయల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46